# సాక్షి పల్నాడు

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023






## ‘ఆదాయ’ కార్యాలయం ప్రారంభం

పాతగుంటూరు: నగరంపాలెంలో ఆదాయ ప న్ను శాఖ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సస్ మెంబర్ సంగీతా సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు.



## ఆధార్ కిట్లు అందజేత

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్ సిబ్బందికి జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే కిలారి, ఎమ్మెల్సీ డొక్కాతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి ఆధార్ కిట్లు అందజేశారు.

## కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

### న్యూస్‌రీల్

## వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే



సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పల్నాడు జిల్లా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ బుధవారం రాత్రి ఓ ప్రకటన జారీ చేసింది. పల్నాడు జిల్లా యువత విభాగం అధ్యక్షుడిగా పడాల సాంబశివారెడ్డి, మహిళా విభాగానికి డాక్టర్ ఎస్.గీతా హసంతి, రైతు విభాగానికి ఒంటేరు చిన్న ఆంజనేయులు, బీసీ సెల్‌కు సాతర్ల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌కు జె.ఆనంద్, ఎస్టీ సెల్‌కు బానావత్ మహేష్‌నాయక్, మైనార్టీ విభాగానికి మహమ్మద్ గఫార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు చవ్వా బాలస్వామిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగానికి యేచూరి సునీతా సాయి శంకర్‌ను నియమించారు. గ్రీవెన్స్ సెల్‌కు సైరెడ్డి గోపిరెడ్డి, చేనేత విభాగానికి పల్లా సైదారావు, వైఎస్సార్ సేవాదళ్‌కు కె.విజయకుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు సాతులూరి కోటి, విద్యార్థి విభాగానికి సయ్యద్ సిరాజ్, వాణిజ్య విభాగానికి అచ్యుత శివప్రసాద్, పబ్లిసిటీ విభాగానికి గనుక పెంట ఉత్తమ్‌రెడ్డి, సాంస్కృతిక విభాగానికి డా.సుశీల్‌కుమార్, ఐటీ విభాగానికి సోము తిరుపతిరెడ్డి, వికలాంగ విభాగానికి కర్నాటి కృష్ణ మూర్తి, డాక్టర్స్ విభాగానికి డాక్టర్ జి.నాగభూషణరెడ్డి నియమితులయ్యారు.

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

## మార్చి 3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను మార్చి 3వ తేదీ నిర్వహించేందుకు జెడ్పీ సీఈవో జె.మోహనరావు బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకుగాను 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్‌చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

## పప్పు దినుసులను ఆర్బీకేల్లో విక్రయించండి

గుంటూరు వెస్ట్: రబీ 2022–23లో పండించిన పప్పుదినుసులను రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్న వీటికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. క్వింటా శనగలకు రూ.5,335, పెసలకు రూ.7,755, మినుములకు రూ.6,600 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తక్కువ ధరలకు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ సిబ్బంది రైతులకు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.

## శనగలకు రూ.5,335 మద్దతు ధర

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, జాతీయ సంస్థ నాఫెడ్ ద్వారా 2022–23 రబీ సీజన్‌లో రైతులు పండించిన శనగలు క్వింటా రూ.5,335 చొప్పున మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు తన అధ్యక్షతన సమావేశమైన జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ నిర్ణయించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి ఒకటవ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) శనగల కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకొని పంటకు తగిన మద్దతు ధరను పొందాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

# పిలిస్తే పలికే దైవం 108

- ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుతున్న 108 సిబ్బంది
- ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలో ప్రత్యక్షం
- క్లిష్టమైన ప్రసవాలు సైతం అంబులెన్స్ లోనే చేస్తున్న సిబ్బంది
- పల్నాడు జిల్లాలో సేవలు అందిస్తున్న 30 వాహనాలు
- ఆరు నెలల కాలంలో 26,364 మందికి సేవలు
- జిల్లాలో సగటున ప్రతి రోజు 1,700 కి.మీ. తిరుగుతున్న 108 వాహనాలు
- ప్రాణాలు కాపాడాలన్నదే లక్ష్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు కె.మరియమ్మ. పురిటినొప్పులతో నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చేరింది. ప్రసవం క్లిష్టమవడంతో గుంటూరు జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించాల్సివచ్చింది. మార్గంలో పురిటినొప్పులు అధికమవ్వడంతో ఈఎంటీ కమల్‌హాసన్, పైలెట్ సుధాకర్ ఎంతో శ్రమించి ఆమెకు ప్రసవం చేశారు. మరియమ్మ మగబిడ్డను జన్మించింది. తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి గుంటూరు ఆసుపత్రికి చేర్చారు. ఇలా ఎంతో మందికి అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్‌లు సేవలు అందిస్తున్నాయి.



మరియమ్మకు 108 వాహనంలో ప్రసవం చేసి పుట్టిన బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది (ఫైల్)

| పల్నాడు జిల్లాలో జూలై-2022 నుంచి డిసెంబర్-2022 వరకు 108 వాహనాలు అందించిన సేవలు.. | |
|---|---|
| గర్భిణులు | 5,821 |
| రోడ్డు ప్రమాదాలు | 3,469 |
| గుండె నొప్పులు | 987 |
| డయాలసిస్ | 3,073 |
| విషం సేవించినవారు | 849 |
| ఆత్మహత్యలు | 52 |
| పాముకాట్లు | 382 |
| ఫిట్స్ | 217 |
| ఇతర రోగులు | 11,514 |
| మొత్తం | 26,364 |

సాక్షి, నరసరావుపేట: ఒకప్పుడు ప్రమాదాలు, అత్యవసర చికిత్సలు అవసరమైనప్పుడు బాధితులను ఆసుపత్రులకు తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు వదిలిన సంఘటనలు అనేకం. ఈ పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108 వాహనాలను ప్రారంభించారు. ఆయన మరణంతో తర్వాత పాలకులు నిర్లక్ష్యం వహించినా ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాటికి పునరుజ్జీవం పోశారు. 108 సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందేలా కృషి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం జరిగినా, గుండెనొప్పి వచ్చినా, గర్భిణులకు పురిటినొప్పులు మొదలలైనా, ఇతర ఏ ఆరోగ్య సమస్యలున్నా ఆపదలో ఉన్నామంటూ ఒక్క ఫోన్ కాల్ వెళితే చాలు. కిలో మీటర్ల దూరమైనా నిమిషాల వ్యవధిలో వెళ్లి అత్యవసర వైద్యం అందించడంతో పాటు దగ్గర్లోని ఆసుపత్రికి బాధితులను చేర్చి ఆపద్బాంధవులుగా మారుతున్నారు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బాధితులు అనేక మంది ప్రాణాలను 108 వాహనం కాపాడింది.



గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది (ఫైల్)

### ఆరు నెలల్లో 26,364 మందికి సేవలు..

పల్నాడు జిల్లాలో 108 అంబులెన్స్‌లు మొత్తం 30 ఉండగా, 184 మంది సిబ్బంది వీటిలో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది జూలై నుంచి డిసెంబర్ మధ్య ఆరు నెలల వ్యవధిలో పల్నాడు జిల్లాలో 108 వాహనాలు 26,364 మంది రోగులకు సేవలు అందించాయి. ఇందులో అత్యధికంగా 5,821 మంది గర్భిణులు సేవలు పొందారు. చాలామందికి ఆసుపత్రికి తరలించే మార్గంలోనే నొప్పులు తీవ్రమవుతుండటంతో వాహనంలోని ఈఎంటీలు పురుడుపోస్తున్నారు. అత్యవసర కేసుల్లో వీరు ప్రసవం చేయడం వల్ల తల్లి, బిడ్డల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోంది. రోడ్డు ప్రమాదాల బారిన పడిన 3,469 మందికి ప్రథమ చికిత్స అందించారు. సగటున నెలకు 4,400 మంది బాధితులకు 108 సిబ్బంది తక్షణ వైద్యం అందిస్తున్నారు.

### రోజుకు సగటున 1,700 కి.మీ. ప్రయాణం..

ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో సంఘటనా స్థలానికి వాహనాలు వెళుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోగుల ప్రాణాలను కాపాడే ఉద్దేశంతో రిఫరల్ ఆస్పత్రులు ఎంత దూరమైనా 108 అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. దీనివల్ల రోగుల ప్రాణాలు కాపాడటంతో పాటు, వారి కుటుంబ సభ్యులకు వేలాది రూపాయల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారు. పల్నాడు జిల్లాలో సగటున ప్రతి రోజు 1,700 కిలోమీటర్ల దాకా రిఫరల్స్ ఆసుపత్రులకు రోగులను వాహనాల్లో తరలిస్తున్నారు.

### తక్షణ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా



ఆపదలో ఉన్న రోగులకు సకాలంలో చికిత్స అందించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ వాహనాలు జిల్లాలో లక్ష్యానికి తగ్గట్టుగా పనిచేస్తున్నాయి. తక్షణ వైద్య సేవలు అందిస్తూనే, రిఫరల్ ఆసుపత్రులకు రోగులను తరలిస్తున్నాయి. జిల్లాలో 30 వాహనాలు ఆరు నెలల కాలంలో 26,364 మందికి సేవలు అందించడం చాలా గొప్ప విషయం. 108 సేవలు మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా



లా నేస్తం మంజూరు పత్రాలను యువ లాయర్లకు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

## ‘లా నేస్తం’ను ఉపయోగించుకోవాలి

- జిల్లాలో 71 మంది యువ న్యాయవాదుల ఖాతాలకు రూ.3.55 లక్షలు జమ
- మంజూరు పత్రాలను అందజేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: వైఎస్సార్ లా నేస్తం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని జూనియర్ న్యాయవాదులు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ ‘లానేస్తం’ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి నగదు జమను నిర్వహించారు. 2,011 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో రూ.1,00,55,000ను బటన్ నొక్కి విడుదల చేసిన కార్యక్రమాన్ని వీక్షించారు. దీని ద్వారా పల్నాడు జిల్లాకు చెందిన 71 మంది జూనియర్ న్యాయవాదులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.3.55 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పల్నాడు జిల్లాకు చెందిన పలువురు యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

# చరిత్రలో చిరస్థాయిగా

- బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే జగనన్న లక్ష్యం
- రాజకీయ, ఆర్థిక అభివృద్ధి దిశగా ఆయా వర్గాలు
- మంత్రి, ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవుల్లో సింహభాగం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. తాజా ఎమ్మెల్సీ నోటిఫికేషన్‌లో 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 14 ఎమ్మెల్సీ స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్ సీపీ కేటాయించిన నేపథ్యంలో బుధవారం చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జగనన్నకు ముందు, జగనన్నకు తర్వాత అనేలా చరిత్ర గుర్తు పెట్టుకొనేలా బడుగు, బలహీనవర్గాల వారికి రాజకీయంగా గొప్పగొప్ప అవకాశాలను సీఎం వైఎస్ జగన్ కల్పిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా ప్రకటనే దీనికి నిదర్శనమన్నారు. ప్రకటించిన 18 స్థానాల్లో ఏకంగా బీసీలకు 11 స్థానాలు కేటాయించటం బీసీలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ స్థాయిలో బడుగు, బలహీన వర్గాల వారికి గతంలో ఎవరూ ఎమ్మెల్సీ లాంటి పదవులు ఇవ్వలేదని వెల్లడించారు. తమ మంత్రివర్గంలో సైతం 25 మంది మంత్రులు ఉంటే వీరిలో 11 మంది ఏకంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలను కలుపుకొని మొత్తం సంఖ్య చూస్తే ఇది 17 అని, జగనన్న క్యాబినెట్‌లో ఏకంగా 70శాతం మంది మంత్రులు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే అని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన ఘనత కూడా జగనన్నదే అని చెప్పారు.

### ఏకంగా నాలుగు రాజ్యసభ సీట్లు ...

ఒకసారి జగనన్న కేటాయించిన రాజ్యసభ సీట్లు చూస్తే ఎవరైనా ఆయన్ను ప్రశంసించాల్సిందేనని మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మందికి రాజ్యసభ పదవులు ఇచ్చే అవకాశం వస్తే వీరిలో ఏకంగా నలుగురు బీసీలకు ఎంపీ పదవులు ఇచ్చి గౌరవించారని చెప్పారు. ఏపీలో బీసీలకు 50 శాతం పదవులు ఇస్తూ జగనన్న ఏకంగా చట్టమే చేశారని గుర్తు చేశారు. బీసీ ఉపప్రణాళికకు ఏటా దాదాపు రూ. 16వేల కోట్ల వరకు కేటాయిస్తూ జగనన్న చరిత్ర సృష్టించారని తెలిపారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి బీసీ జాతికి కొత్త రూపు తీసుకొచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చరిత్రలో నిలచిపోతారని కొనియాడారు.

### లక్షల కోట్ల సంక్షేమం..

వివిధ కుల వృత్తుల వారికి ఆసరాగా ఉండేలా లక్షల కోట్ల రూపాయాల సంక్షేమాన్ని బీసీ సోదరులకు అందిస్తున్న మనసున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని తెలిపారు. బడుగు బలహీనవర్గాల వారికి ఆర్థిక సాధికారిత కోసం ఇప్పటివరకు జగనన్న ఏకంగా రూ 3.25 లక్షల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ‘బాబు నన్ను చంపాలని చూశాడు’

- నాడు మీడియా వేదికగా ఆరోపణలు
- నేడు అదే చంద్రబాబు గూటికి కన్నా..
- కన్నా రాకను వ్యతిరేకిస్తున్న రాయపాటి వర్గం
- కన్నాను స్వాగతించని జిల్లా తెలుగుదేశం నేతలు
- సత్తెనపల్లి, గుంటూరు వెస్ట్‌లో తన వర్గాలను కూడగడుతున్న కన్నా
- అసంతృప్తిలో దేశం నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ‘చంద్రబాబు నన్ను, వంగవీటి రంగాను చంపడానికి స్కెచ్ వేశాడు. రంగా విషయంలో సక్సెస్ అయ్యాడు. నా విషయంలో ఫెయిల్ అయ్యాడు.. ఇది మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబునాయుడును ఉద్దేశించి ఎల్లోమీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు. అదే కన్నా నేడు చంద్రబాబు గూటికి వెళ్లడానికి ప్రయత్నించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

### అసంతృప్తితో రగిలిపోయి..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజును నియమించినప్పటి నుంచి అసంతృప్తితో రగిలిపోతున్న కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం తీర్థం పుచ్చుకునేందుకు తెరవెనుక పావులు కదుపుతూ వచ్చారు. తన చిరకాల ప్రత్యర్థి అయిన రాయపాటి సాంబశివరావుతో కూడా కేసుల విషయంలో రాజీ పడ్డారు. తర్వాత క్రమంలో సొంత పార్టీ బీజేపీపై విమర్శలు చేస్తూ వచ్చారు. అదే సమయంలో తెలుగుదేశం, జనసేన రెండు పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ కూడా వచ్చి కన్నాను కలిసి వెళ్లారు. అయితే జనసేన, తెలుగుదేశం పొత్తు ఉంటుందా? చివరి నిమిషంలో ఉండకపోతే ఇబ్బంది పడతామనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీలో చేరడానికే నిర్ణయించుకున్నారు.



టీడీపీలో చేరబోతున్న కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు చెబుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

1989 నుంచి తెలుగుదేశం పార్టీతో పోరాడుతూ వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు ఆ పార్టీ నేతలతో వైరం ఉంది. కన్నా లక్ష్మీనారాయణ, రాయపాటి సాంబశివరావు రెండు వర్గాలుగా జిల్లాలో రాజకీయం చేశారు. నేడు ఆ ఇద్దరు ఒకే ఒరలో ఇముడుతారా? అన్నది సందేహంగా మారింది. మరోవైపు కన్నా లక్ష్మీనారాయణ రాకను తెలుగుదేశం నాయకులతో పాటు కేడర్ కూడా వ్యతిరేకిస్తోంది. కన్నా తెలుగుదేశంలో చేరుతారని ప్రకటించిన తర్వాత మాజీ మంత్రి ఆలపాటి రాజా మినహా ఎవరూ కలవకపోవడం గమనార్హం.

కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశంలో చేరుతున్న సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన బ్యానర్లలో ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్ మినహా మరే తెలుగుదేశం నాయకుడి ఫొటోలు వేయకపోవడం పట్ల తెలుగుదేశం నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం నేతలు ఒక్కరు కూడా కన్నా లక్ష్మీనారాయణను స్వాగతిస్తూ ఒక్క ఫ్లెక్సీ కూడా పెట్టకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కన్నా రాకపై బహిరంగంగా వ్యాఖ్యానించకపోయినా వ్యతిరేక వర్గం చంద్రబాబునాయుడును కలిసి తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే పార్టీ ఉన్న కష్టకాలంలో ఎవరు వచ్చినా వ్యతిరేకించవద్దని చంద్రబాబు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. కన్నా సత్తెనపల్లి, గుంటూరు పశ్చిమలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా తన అనుచరులను ఇప్పటి నుంచి సమాయత్తపరుస్తున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని భావిస్తున్న తెలుగుదేశం నాయకులు కన్నా రాకను వ్యతిరేకిస్తున్నారు. బయట నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తే తాము సహాయ నిరాకరణ చేయాల్సి వస్తుందని తెలుగుదేశం నాయకులు తమ అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కన్నా రాకతో తెలుగుదేశం పార్టీలో మరో వర్గం ఏర్పడటం ఖాయంగా కనపడుతోంది.

# 27న సీఎం వైఎస్ జగన్ తెనాలి రాక



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్, జేసీ రాజకుమారి

- మూడో విడత రైతు భరోసా ఆర్థిక సాయం పంపిణీ, బహిరంగ సభ
- సభాప్రాంగణం, హెలిప్యాడ్ పరిశీలించిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీ తెనాలి పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రాంతాలను బుధవారం సాయంత్రం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ కోసం తాలూకా జూనియర్ కాలేజి స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణం కోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డు కమిటీ పరిపాలన భవనంలో అధికారులతో సమావేశమయ్యారు. ప్రాథమిక పరిశీలన మినహా హెలిప్యాడ్ ఎక్కడనేది ఇంకా నిర్ణయానికి రాలేదు. గురువారం మరోసారి అందరు అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైందని, ఈలోగా సంబంధిత శాఖలు సన్నాహాలు చేయాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్లపై ప్యాచ్ వర్కులను పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈకి సూచించారు. హెలిప్యాడ్ వద్ద గ్రీన్ రూమ్, టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలన్నింటినీ భాగస్వాములను చేయాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును ఆదేశించారు. రైతులు సభకు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ, నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా నగదును రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.నిర్మల, జిల్లా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రావణ్‌కుమార్, తెనాలి డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్, తహసీల్దార్ కె.రవిబాబు, డెప్యూటీ డీఎంహెచ్ఓ ఈ.అన్నపూర్ణ, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ఎంపీడీవో విజయాలక్ష్మణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జనం గుండెల్లో జగన్

- జగన్‌కు జేజేలు పలుకుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- 70 శాతం పదవులను బడుగు, బలహీన వర్గాలకు కేటాయించిన సీఎం జగన్

మాచర్ల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వ అన్ని పదవులు, నామినేటెడ్ పదవుల్లో 70 శాతం భాగస్వామ్యం చేసి రాజ్యాధికారాన్ని అప్పగించిన మొట్టమొదటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మాచర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చరిత్రలో ఇంత వరకూ ఏ ఒక్క ముఖ్యమంత్రి దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 70 శాతం అవకాశం కల్పించలేదన్నారు. జగన్ జనం గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక విప్లవానికి తెర తీశారని స్పష్టం చేశారు. గతంలో అనేక పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూసి రాజకీయాలు చేశారని, అందుకు భిన్నంగా సామాజిక న్యాయం చేయటమే తన ధ్యేయమంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళుతున్నారని కొనియాడారు. తాజాగా 18 ఎమ్మెల్సీ సీట్లలో బీసీ సామాజిక వర్గాలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1 ఎమ్మెల్సీ పదవులను కేటాయించారన్నారు. గతంలో కూడా 8 రాజ్యసభ స్థానాలకు నలుగురు బీసీలను ఎంపిక చేశారని తెలిపారు. సీఎం కుటుంబంపై ప్రతిపక్షాలు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని హితవుపలికారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీలు మల్లుస్వామి, షేక్ షఫీ, మైనార్టీ నాయకులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

# సీఎం జగన్‌ను కలిసిన మంత్రి అంబటి


సీఎంతో కరచాలనం చేస్తున్న అచ్యుత, పక్కన మంత్రి

సత్తెనపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత్ శివప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో ప్రజలతో మరింత మమేకం కావాలని సీఎం సూచించారు.

# మైనింగ్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేయాలి

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్


అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో తప్పని సరిగా విజిలెన్స్ కమిటీ నిరంతరం తనిఖీలు చేపట్టి నివేదికలు పంపాలని ఆ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జిల్లాలో గనుల శాఖకు సంబంధించి జిల్లా ఖనిజ నిధులు(డి.ఎం.ఎఫ్) ఎంత ఉన్నాయో పూర్తి స్థాయి నివేదికను తమకు పంపాలని కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాన్-ఆపరేషన్ పరిధిలో ఉన్న లీజులకు సంబంధించి తనిఖీలను వెంటనే నిర్వహించి అనుమతులను ఇస్తూ క్లియరెన్స్ పత్రాలను ఇవ్వాలని కోరారు. వాటికి ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. దాచేపల్లి మండలం బట్రుపాలెం ప్రాంతంలో రంగురాళ్లను తస్కరించుకు పోతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన కలెక్టర్ ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులు ఒక కమిటీగా ఏర్పడి అక్కడ జరుగుతున్న పరిస్థితులను పరిశీలించి వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉదహరిస్తూ నివేదికను తయారు చేసి వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. రాజుపాలెం మండలం టీఎస్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు స్పందన ద్వారా ఫారెస్ట్ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వడంలేదని ఫిర్యాదుపై నివేదిక అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారులు రామోహనరావు, డీడీ రంగకుమార్, డీడీ సత్యనారాయణ, అటవీ శాఖ అధికారి రామచంద్రరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ పాల్గొన్నారు.

# ఎస్‌పీఎల్ రీజనల్ విజేతలు సర్ సీఆర్ రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

- ముగిసిన రీజనల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి
- జూనియర్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ విజయం
- నేటి నుంచి విజ్ఞాన్‌లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు

SAKSHI — SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE | APMDC | APMDC FOUNDATION

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) రీజనల్ స్థాయి జూనియర్స్, సీనియర్ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఉత్కంఠభరితంగా ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్ల మధ్యపోరు హోరాహోరీగా సాగాయి. రీజనల్ స్థాయి విజేతల బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా ఏ గౌరిశంకర్‌రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ క్రీడాకారులు మాత్రమే వరల్డ్ చాంపియన్స్ అవ్వగలరని పేర్కొన్నారు. క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. శారీరక శ్రమ కలిగే విధంగా ఆటలు ఆడటం వలన విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా ఎంతోమంది ఉన్నత స్థానాలకు వెళ్లి దేశ ప్రతిష్టను పెంచారని గుర్తు చేశారు. మానసిక ఉల్లాసం కోసం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ పర్యవేక్షించారు.


ట్రోఫీని అందుకుని కేరింతలతో విన్నర్స్ ఎన్నారై జూనియర్ కళాశాల, విజయవాడ

### నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

- సీనియర్స్ విభాగంలో సీకామ్ డీగ్రీ కాలేజ్ (తిరుపతి) వర్సస్ ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)
- జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ ( విశాఖపట్నం) వర్సస్ ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ)
- సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు) వర్సస్ సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి)

**నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి విజయదుందుభి**

రీజనల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో భాగంగా నిర్వహించిన నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి(ఏలూరు) కాలేజీ విజయదుందుభి మోగించింది. మొదట టాస్ గెలిసి సర్ సీఆర్ రెడ్డి టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి(గుంటూరు) కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ నందు 21 పరుగులు(2 ఫోర్లు, 1 సిక్స్)తో రాణించాడు. సర్ సీఆర్ రెడ్డి కాలేజీ బౌలర్ కే గణేష్ 3 వికెట్లతో మెరిశాడు. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సర్‌సీఆర్ రెడ్డి కాలేజీ బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయి చరణ్ 36 పరుగులు(4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

## జూనియర్స్ రీజనల్ విజేత ఎన్‌ఆర్‌ఐ


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రేవంత్ (50 పరుగులు)

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ(విజయవాడ) విజేతగా నిలిచింది. రన్నర్‌గా సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్(ఏలూరు) రన్నర్‌గా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్స్) దుమ్మురేపాడు. అనంతరం 94 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ బ్యాట్స్‌మెన్, కెప్టెన్ కే సాయి చరణ్ 18 పరుగులు( 2 ఫోర్లు) మాత్రమే రాణించాడు. ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ నలుగురు బౌలర్లు జాఫర్, ప్రకాష్, తేజదీప్, రేవంత్ తలో 2 వికెట్లు తీసి సమష్టి కృషితో విజయంలో కీలకపాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.


జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్నారై(విజయవాడ) జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గౌరిశంకర్, సాక్షి బ్రాంచి మేనేజర్ గోపీ

## సీనియర్స్ రీజనల్ విజేత సర్ సీఆర్ రెడ్డి


సీనియర్స్ విభాగంలో విజేత సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఏలూరు) జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్, సాక్షి బ్రాంచి మేనేజర్ గోపీ

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ(ఏలూరు) రీజనల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ(నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సర్ సీఆర్ రెడ్డి టీమ్‌లో నాగవెంకట తేజ 32(3 ఫోర్లు) పరుగులతో రాణించారు. ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ బౌలర్లలలో మనోజ్, అమర్‌నాథ్ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం 96 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి కళాశాల బౌలర్లు హేమంత్, ఉమేష్, మధు ఒక్కొక్కరు రెండు వికెట్లతో రాణించారు. 32 పరుగుల చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

# ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేయాలి

పీడీ జోసఫ్‌కుమార్


మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్‌కుమార్

దాచేపల్లి: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. 2021-22 సంవత్సరానికి గాను రూ.10 కోట్లు విలువ చేసే 652 పనులను తనిఖీల బృందం పరిశీలించారు. పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.4.07 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు రూ.1.16 కోట్లు, ఉపాధి హామీ పథకం పనులకు రూ.4.75 కోట్లను ఖర్చు చేసినట్లుగా గుర్తించారు. వీటిలో రూ.42వేలు అవకతవకలు జరిగినట్లు తనిఖీల బృందం గుర్తించింది. ఈ సందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా పని కావాలనే కోరుకునే ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు క్రమం తప్పకుండా కూలీ వేతనాలు చెల్లించాలని, అక్రమాలకు పాల్పడే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, ఏపీఓ మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

# పవిత్ర పరలోకాన్ని ప్రసాదించేది క్రీస్తే


దీక్షలలో పాల్గొనే భక్తులకు మాలలు వేస్తున్న విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్

విజయపురిసౌత్: పవిత్ర పరలోకాన్ని ప్రసాదించేది క్రీస్తే అని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. దేవాలయంలో శ్రమదినాలను పురస్కరించుకొని నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి బుధవారం ప్రసంగించారు. ఈ రోజు నుంచి ఉపవాస కాలం మొదలవుతుందని చెప్పారు. ఈ 40 శ్రమల దినములను అందరూ ఆచరిస్తూ ఎక్కువ సమయం ప్రార్థనలో గడుపుతూ ఏసుక్రీస్తును ఆరాధించాలని కోరారు. ఏసుప్రభువు మానవుడై మన రక్షణకై శ్రమపడిన విధమును ఈ ప్రత్యేక దినమున జ్ఞాపకం చేసుకొనుట మనకెంతో ఆశీర్వాదమన్నారు. అనంతరం 14 స్థలాలలో భక్తులు ప్రదక్షణలు చేసి ప్రార్థనలు చేశారు. ఆ తరువాత 40 రోజులు దీక్ష తీసుకునే భక్తులకు విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, జోసఫ్ తంబి, బ్రదర్ అనిల్‌కుమార్ మాలలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, కె.శౌరారాజు, శౌరిబాబు, మరియదాసు పాల్గొన్నారు.

## 25న నరసరావుపేటలో మెగా జాబ్‌మేళా


మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో 25వ తేదీ నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మాట్లాడుతూ పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మేళాకు ఎస్‌వీకే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆక్సిస్ బ్యాంక్, హెటిరో, కాలిబర్, అపెక్స్ సొల్యూషన్స్ తదితర 12 కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు వీరాంజనేయులు 9160200652, నాయక్ 9010585360, ప్రసాద్ 9866822697లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, జిల్లా ఉపాధి అధికారి ఎస్.పద్మ, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ ఏఎస్ దీప్తి పాల్గొన్నారు.

## 27లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: రబీలో పంటలను సాగు చేసిన రైతులు ఈనెల 27వ తేదీలోగా రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ-పంట, ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రబీలో ఇప్పటి వరకు 1,11,706 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేసినట్లు తెలిపారు. అందులో 1,04,698 ఎకరాలను ఈ-పంట నమోదు చేయడం జరిగిందని చెప్పారు. గ్రామ స్థాయిలో వీఏఏ, వీఎస్ఏ, వీఆర్‌ఓలు 1,00,840 ఎకరాల విస్తీర్ణాన్ని ధ్రువీకరించినట్లు వివరించారు.

## సాగర్ నీటి మట్టం 553 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 553.00 అడుగుల వద్ద ఉంది. ఇది 216.4350 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200, ఎడమ కాలువకు 8,807, ఎస్ఎల్‌బీసీకి 1,650, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,977 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,977 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 827.20 అడుగుల వద్ద ఉంది. ఇది 46.7456 టీఎంసీలకు సమానం.

## పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6707 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 1200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

## గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

నకరికల్లు: ప్రమాదవశాత్తు గుంటూరు జిల్లా బ్రాంచి కెనాల్‌లో పడి గల్లంతైన యువకుల మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. మండలంలోని కండ్లకుంట సమీపంలో జీబీసీ కెనాల్‌లో సోమవారం రాత్రి ఇద్దరు యువకులు గల్లంతైన విషయం విదితమే. పోలీసుల గాలింపు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కెనాల్‌పై ఉన్న కేసీపీ పవర్‌ప్లాంట్ వద్ద ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియావైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.